సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ అండర్–17 బాల, బాలికల జట్టును ఆరోగ్యవరం సమీపంలోని వేద పాఠశాలలో బుధవారం ఎంపిక చేశారు. -8లో



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా తోడుంటాం

అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు తోడుగా ఉంటామని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.480
రెండోరకం	రూ.340	రూ.400

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 128 మెట్రిక్ టన్నులు



1 ప్రతి నిరుద్యోగికి రూ.3,000 నిరుద్యోగ భృతి



ఇరవై లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. అప్పటివరకు ప్రతి నిరుద్యోగికి ప్రతి నెలా రూ.3000 భృతి ఇస్తాం
- రాయచోటి ఎన్నికల ప్రచారంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

2 రైతుకు ఏటా రూ.20,000 సాయం

కూటమి ప్రభుత్వం వస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు సాయం అందిస్తాం .



- రైల్వేకోడూరు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్

3 ప్రతి ఇంటికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం

టీడీపీ అధికారంలోకి వస్తూనే ప్రతి ఇంటికి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం.



- మదనపల్లె ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా

4 తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ. 15,000



అధికారంలోకి వస్తూనే ప్రతి విద్యార్థికి రూ. 15 వేల వంతున ఎంత మంది చదివే పిల్లలు ఉంటే అందరికీ ఇస్తాం.
- పీలేరు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

5 మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం

కూటమి అధికారంలోకి వస్తూనే మహిళలందరికీ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం



- ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్

6 ఆడబిడ్డ నిధి ద్వారా మహిళలకు నెలకు రూ. 1,500

18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెల నెలా రూ. 1500 అకౌంట్లో జమ చేస్తాం.



- ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు

బాబూ.. ఏదీ జవాబు?

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం




రైతుకు భరోసా ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ. 20 వేల చొప్పున అన్నదాతా సుఖీభవ కింద ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఖరీఫ్ సాగు పూర్తవుతున్నా పథకం గురించి ఇంతవరకు ప్రకటన లేదు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతు భరోసా ప్రతి ఏటా అందేది. -ఎస్.ఉత్తమ రెడ్డి, అంగళ్లు, కురబలకోట మండలం

మహిళలకు ప్రతి నెలా రూ.1500




ఆడబిడ్డ నిధి ఎప్పుడు?



18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 నేరుగా మహిళల ఖాతాల్లో జమచేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చి 50 రోజులు కావస్తోంది. చెప్పిన ప్రకారం అమలుచేసి ఉంటే ఇప్పటికి రూ.3,000 దాకా వచ్చి ఉండేవి.తక్షణమే అందరికీ ఆడబిడ్డ నిధి అందించాలి. - పల్లవి, మంజునాథ కాలనీ, మదనపల్లె

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి



నా పేరు యామల అంజమ్మ, బొజ్జవారిపల్లి వడ్డిపల్లి గ్రామం. కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. మాకు ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి. వాటికి ఎటువంటి షరతులు పెట్టకూడదు. కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలి.

బాబు సూపర్ 6 ఫ్లాప్



చంద్రబాబు మాటలు నీటి మూటలేనని రుజువయ్యాయి. తల్లికి వందనంపై మాట మార్చారు. నిరుద్యోగ భృతి పథకానికి నిలువునా పాతిపెట్టారు. అన్నదాత సుఖీభవ పేరిట ఏటా 20 వేలు ఇస్తా.. వ్యవసాయానికి వెన్నుదన్నులా' అంటూ మాటిచ్చి రైతన్నకు వెన్నుపోటు పొడిచారు. పెట్టుబడి సాయం మాటే మర్చిపోయారు. ఇక పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద రూ.1500 ఇస్తామన్నారు.. ఇప్పుడా ఊసే లేకుండా చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వలేమంటూ అసెంబ్లీ సాక్షిగా తేల్చి చెప్పారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంపై పూటకో మాట మాట్లాడుతున్నారు. మొత్తానికి 'బాబు ష్యూరిటీ.... భవిష్యత్‌కు గ్యారెంటీ' అంటూ ఎన్నికల వేళ ఊదరగొట్టిన బాబు.. భవిష్యత్తు ఏమోగానీ ప్రస్తుతానికి 'మోసం గ్యారెంటీ' అని మరోసారి రుజువు చేశారు. కామధేనువులాంటి వైఎస్ జగన్ సర్కార్‌ను పోగొట్టుకున్నామని.. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు వేదన చెందుతున్నారు.

- ఆరింట్లో ఒక్క పథకమూ అమలు కాలేదు
- ఆరునూరైనా అమలు చేయాలంటున్న జనం

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

9లో

సాక్షి రాయచోటి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే...చేస్తాడంతే... ఇది అందరి నోళ్లలో నానుతున్న పచ్చి నిజం. ప్రస్తుతం సీఎం చంద్రబాబు చెప్పాడంటే..చేయడంతే...ఇదీ అందరి అభిప్రాయం. ఎన్నికల్లో గెలవడం కోసం కూటమి నేతలు అనేక రకాల హామీలతోపాటు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రచార హోరు చేపట్టారు. అధికారంలోకి వచ్చాక ఆర్థిక సమస్య పేరుతో ప్రజలకు నిలువునా పంగనామాలు పెట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికిప్పుడు అమలు చేయడం సాధ్యం కాదంటూ బాబు చెబుతున్న మాటలు వింటుంటే ఏరు దాటక ముందు ఏటి మల్లన్న...ఏరు దాటాక బోడి మల్లన్న అన్న సామెత గుర్తుకు తెచ్చేలా చేస్తోంది. అంతకుముందు 2014లోనూ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాగే అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేక చేతులెత్తేసిన ప్రస్తుత సర్కార్ మరోమారు మాయ చేసేలా కనిపిస్తుండడంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు కరోనా విపత్కర పరిస్థితులు ఎదురైనా క్యాలెండర్ ప్రకారం చెప్పిన విధంగా పథకాలను ప్రజలకు అందించింది.

అప్పుడలా...ఇప్పుడిలా....

వైఎస్ జగన్ సర్కార్ దిగిపోయే సమయానికి కూడా సవాలక్ష ఆర్థిక సమస్యలు ఉన్నా కచ్చితంగా లబ్ధిదారులకు పథకాలను అందించారు. ప్రతినెలలోనూ మూడు, నాలుగు పథకాలకు సంబంధించి ఆయా తేదీల్లో బటన్‌నొక్కి అందించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల విషయంలో ముందుకు అడుగులు వేయకుండా కుంటి సాకులు చెబుతూ సాగతీతపై అందరిలోనూ ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.


అందరికీ అన్యాయమే

నేను మారానని పైకి చెబుతున్నా..ఎన్నికల్లో చెప్పిన మాటలను అమలు చేయకపోతే మారిన బాబు అని ఎలా అంటారన్న మాట ప్రజల్లో వినిపిస్తోంది. వైఎస్ జగన్ సర్కార్ హయాంలో అందరికీ సంక్షేమం అందితే....ప్రస్తుత కూటమి సర్కార్ హయాంలో అన్ని వర్గాలకూ అన్యాయమే జరుగుతోంది. అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతున్నా సూపర్ సిక్స్ పథకాల్లో కీలకమైన వాటిని కూడా అమలు చేయకపోవడంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా రైతుకు అందించాల్సిన భరోసా సొమ్ములు విడుదల చేయలేదు. అధికారంలోకి వస్తే ఒక్కో రైతుకు రూ. 20 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ ద్వారా అందిస్తానని పేర్కొన్నా.. ప్రస్తుత పరిస్థితుల్లో రైతన్న సంక్షోభంలో ఉన్నా.. అందించకపోవడాన్ని ఏమంటారని రైతులు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే తన వాటాను రైతుల ఖాతాకు జమ చేసినా రాష్ట్ర ప్రభుత్వం అందించకపోవడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. అమ్మఒడి పథకానికి సంబంధించి కూటమి సర్కార్ తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున కుటుంబంలో ఎంతమంది ఉన్నా అందిస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. జిల్లా వ్యాప్తంగా 1734 ప్రాథమిక, 162 ప్రాథమికోన్నత, 304 ఉన్నత పాఠశాలల్లో 1,54,789 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలోని 136 జూనియర్ కళాశాలల్లో 28,050 మంది చదువుతున్నారు. జూన్ 13 నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్నా ఇప్పటికీ వారి తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమ చేయకపోగా ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి చూసి పలువురు లబోదిబోమంటున్నారు. నిరుద్యోగ యువతకు సంబంధించి ఉపాధి కల్పనతోపాటు ఉద్యోగం లేని వారికి రూ. 3000 చొప్పున యువశక్తి కింద భృతి అందిస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా యువత ఎదురు చూస్తోంది. అందులో అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వం భృతి కింద రూ. 3000 అందించాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు లేవు. ఆడబిడ్డ నిధి కింద ఇంటిలో ఉన్న ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి రూ. 1500 చొప్పున ఇస్తామని చెప్పినా ఇంతవరకు దాని ఊసేలేదు. ఎప్పటినుంచి ఇస్తారో చెప్పకపోగా దీనిని కూడా అమలు చేయడం సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

'గ్యాస్' కబుర్లే

కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌లో పెట్టిన హామీల్లో ముఖ్యమైనది ఉచిత సిలిండర్లు. అధికారంలోకి రాగానే ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామని బాబు ఊదరగొట్టినా ఇప్పుడు మాత్రం ఉసూరుమనిపించారు. కనీసం ఎక్కడా కూడా ఉచిత సిలండర్ మాటే ఎత్తడం లేదంటే కచ్చితంగా శఠగోపం పెట్టినట్లేనని ప్రజలు అంటున్నారు. సూపర్ సిక్స్‌లో మరో పథకమైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మాట అదిగో ఇదిగో అంటున్నా స్పష్టతం ఇవ్వడం లేదు. అసలు అమలుకు ఎలాంటి నిబంధనలు విధిస్తారో కూడా ఇంతవరకు కూటమి సర్కార్ స్పష్టం చేయలేదు. ఆర్డినరీ మొదలుకొని ఏసీ బస్సుల వరకు ఉచిత అవకాశం కల్పిస్తారా? లేక పల్లె నుంచి పట్టణం వరకు ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారా? అనేది అర్థం కావడం లేదు. అసలు సూపర్ సిక్స్ పథకాల అమలు విషయంలోనే ప్రభుత్వం చొరవ చూపడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా సూపర్ సిక్స్‌తోపాటు మ్యానిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చినా ఆర్థిక ఇబ్బందులు పేరుతో కుంటి సాకులు చెబుతూ మంగళం పాడుతోందని సర్వత్రా ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాల లబ్ధి






బంపర్ హిట్

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం ప్రతి ఇంటితలుపు తట్టింది.
అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్ఆర్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన..
ఇలా ఒకటా రెండా ఇచ్చిన ప్రతి హామీ అమలైంది.
సంక్షేమ క్యాలెండర్ ఏర్పాటు చేసి మరీ హామీలు అమలు చేసిన ఘనత జననేతకే దక్కింది.
ఇంటింటా సంక్షేమం వెల్లివిరిసింది.

బాబూ.. ఏదీ జవాబు?

స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు




తల్లికి వందనం ఎప్పడిస్తారో?



నాకు ఐదుగురు పిల్లలు. ముగ్గురు బడికి పోతున్నారు. మేము పేదోళ్లం. చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పేరుతో ఒక్కో బిడ్డకు రూ. 15 వేలు ఇస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చాడు. ఇంతవరకు డబ్బులు ఖాతాలో పడలేదు. ఎప్పడిస్తారో తెలియడంలేదు . వైఎస్ జగన్ ఉన్నప్పుడు అన్ని పథకాలు ఠంఛనుగా వచ్చేవి. - యమున, కొమ్మివారిపల్లె, రాజంపేట

నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి




నిరుద్యోగ భృతి ఊసే లేదు



నేను ఎంఎస్‌సీఎస్ కోర్సు పూర్తి చేశాను. ఇప్పటి వరకు ఉద్యోగం లేక ఖాళీగానే ఉన్నాను. కూటమి ప్రభుత్వం ఉద్యోగం లేని వారికి నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పింది. కానీ ఇప్పటి వరకు దీని ఊసే లేదు. -నంద్యాల శ్రీకాంత్, సుండుపల్లె

ప్రతి ఇంటికి ఏటా మూడు సిలిండర్లు ఉచితం



గ్యాస్ సిలిండర్ల హామీ గ్యాసేనా..



కూటమి ప్రభుత్వం ఇచ్చిన గ్యాస్ సిలిండర్ల హామీ గ్యాస్‌గానే అనిపిస్తోంది. ఇంత వరకు 3 గ్యాస్ సిలిండర్ల హామీపై స్పష్టమైన ప్రకటన రాలేదు. ప్రభుత్వం హామీని అమలు చేయాలి. మా లాంటి పేదవారిని ఆదుకోవాలి. - హరిణి, కొత్తపేట, రాయచోటి

క్లుప్తంగా

వైభవంగా ఒంటిమిట్ట రామయ్య పౌర్ణమి కల్యాణం



కల్యాణ దంపతులైన సీతారాములు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కారు - ద్విచక్ర వాహనం ఢీ



రోడ్డు ప్రమాదంలో గాయపడినవారు

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండ్లావారిపల్లి క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని బూర్లపల్లి పంచాయతీ సాన్నువారిపల్లికి చెందిన నరసింహులు (70), ఉత్తన్నలు ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట వైపు వెళుతుండగా ములకలచెరువు వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ఉన్న నరసింహులు ఎడమ కాలు మోకాలి భాగంలో పూర్తిగా విరిగింది. ఉత్తన్నకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరసింహుడు హుటాహుటిన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

పిల్లలు పుట్టలేదని వ్యక్తి ఆత్మహత్య



మహమ్మద్ మృతదేహం

ములకలచెరువు : పిల్లలు పుట్టలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు... స్థానిక రాజీవ్‌కాలనీలో కాపురం ఉండే మహమ్మద్(40) వ్యవసాయమార్కెట్‌కు చెందిన చెక్‌పోస్టులో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వేపూరికోటకు చెందిన హమీదాతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి పిల్లలు పుట్టలేదని తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ గాయత్రి కేసు నమోదు చేశారు.

40 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ రామానాయక్ తాండా అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి ఓ మహిళను అరెస్టు చేసినట్లు పీలేరు ఇన్‌చార్జి సీఐ దస్తగిర్ తెలిపారు. ఆమె వద్దనుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఇందిరమ్మ కాలనీకి చెందిన బుక్కే రోజా 10 లీటర్ల సారా కలిగి ఉండగా అరెస్టు చేశామన్నారు. ఈ దాడిలో ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై ఎస్పీకి ఫిర్యాదు

నందలూరు : మండల పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లోకి అనుమతి లేకుండా టీడీపీ రాష్ట్ర అధికార పార్టీ ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి అతని అనుచరులతో దౌర్జన్యంగా ప్రవేశించాడని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ 4వ తేదీ దౌర్జన్యంగా ప్రవేశించి ఎంపీపీకి సంబంధించిన వ్యక్తిగత పత్రాలను తస్కరించారన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్, ఎంపీపీలు ఆకేపాటి రమేష్ రెడ్డి, సుభాన్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మల శ్రీధర్, సోమిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు

ఎల్లవేళలా తోడుంటాం

- రాయచోటిలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎంపీ మిథున్‌రెడ్డి
- పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైన నాయకులకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

రాయచోటి : అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా తోడుగా ఉంటామని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటిలో పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లి పార్టీ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహమ్మద్ తదితరులు హాజరయ్యారు. కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కష్ట నష్టాలలో తోడుగా నిలిచిన కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కొంతమంది స్వార్థపరులు, బ్రోకర్లు పార్టీని వదలివెళ్లడం మంచి పరిణామమన్నారు.

సమిష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందాం

జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పేదల సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజలను మోసగించారన్నారు.

ప్రజల పక్షాన నిలుస్తాం

రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం ప్రతిపక్షం పాత్రను పటిష్టంగా పోషించి ప్రజల పక్షాన నిలుస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రశాంతతకు ఎల్లవేళలా తాను సహకరిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

ఖజానా ఖాళీగా ఉంది.. భయమేస్తోందంటూ చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి తప్పుబట్టారు. హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబుకు తెలీదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షపూరిత చర్యలకు పూనుకోవడం దారుణమన్నారు.

ప్రభుత్వమా లేక ప్రైవేట్ ట్రస్టు నడుపుతున్నారా..?

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం నడుపుతున్నారా.. లేక ప్రైవేట్ ట్రస్ట్ నడుపుతున్నారా? అని కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి చేపడుతున్న పనులకు ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తుండటంపై ఆయన ఫైర్ అయ్యారు.

జనాదరణను కోల్పోయారు

చంద్రబాబు తన వంద రోజుల పాలనలో జనాదరణను కోల్పోయారని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయని చంద్రబాబు గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందన్నారు. రేపటి భవిష్యత్ వైఎస్సార్‌సీపీదే అన్నారు.

టీడీపీ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు

టీడీపీ పాలనలో జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అన్నారు. మాజీ సీఎం జగన్‌పై ఉన్న నమ్మకంతో పార్టీ క్యాడర్ అంతా జగన్‌కు తోడుగా నిలుస్తున్నారన్నారు. తెలుగుదేశం పెడుతున్న అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.

రెడ్ బుక్ కాదు.. గుడ్ బుక్ పెడతాం

జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే టీడీపీ లాగా రెడ్ బుక్ పాలన కాకుండా గుడ్ బుక్ పెడతామని మదనపల్లె పార్టీ ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్ తెలిపారు. రానున్న రోజుల్లో కార్యకర్తలు, నాయకులను పార్టీ ప్రాణంగా చూసుకుంటుందన్నారు.

మాజీ మంత్రి ఆర్‌ఆర్‌కు నివాళులు

దివంగత మాజీ మంత్రి రెడ్డప్పగారి రాజగోపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సభ ఘనంగా నివాళులు అర్పించింది. లక్కిరెడ్డిపల్లి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఆయన పాటుపడ్డారని కొనియాడారు.

'నా పొలాన్ని నాశనం చేశారు'



రైతు పొలంలో ఇష్టారాజ్యంగా తవ్వేసిన గుంతలు

పెద్దతిప్పసముద్రం : వ్యవసాయానికి అనువుగా ఉన్న తన పొలాన్ని ఉపాధి హామీ సిబ్బంది సర్వనాశనం చేశారని నీరుగట్టి సూర్యనారాయణరెడ్డి అనే రైతు బుధవారం జిల్లా కలెక్టర్, డ్వామా పీడీ, ఎంపీడీఓ, ఏపీఓకు ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు కథనం మేరకు.. మండలంలోని కాట్నగల్లు పంచాయతీ బూచిపల్లికి చెందిన రైతు సూర్యనారాయణరెడ్డికి సర్వే నంబర్ 258లో వ్యవసాయ భూమి ఉంది. అనారోగ్య పరిస్థితుల కారణంగా గత మూడేళ్లుగా బెంగళూరులో ఉండేవాడు. ఆరోగ్యం కుదుట పడటంతో స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం పొలం వద్దకు వెళ్లాడు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శివశంకర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ కదిరప్పలు రైతు పొలంలో ఫారం పాండ్, దిగుడు గుంతలు ఇష్టారాజ్యంగా తవ్వించేసి వ్యవసాయానికి పనికి రాకుండా చేశారని గమనించి అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై ఎంపీడీఓ కేఎస్ బాలాజీని వివరణ కోరగా బాధిత రైతు ఫిర్యాదును స్వీకరించి వివరాలు తెలుసుకుంటున్నామన్నారు.

ఎమ్మెల్యే అండతో...దారి ఆక్రమణ



మైకావీధికి దారి లేకుండా ఏర్పాటు చేసిన గేటు

మదనపల్లె : పట్టణంలోని గాంధీరోడ్డు నుంచి మైకావీధిలోకి వెళ్లే దారిని టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అండతో బుధవారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడమే కాకుండా ఇతరులు వెళ్లేందుకు వీలు లేకుండా గేటు ఏర్పాటు చేశారు. దీనిపై మైకావీధి ప్రజలు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చి ఆక్రమణ తొలగించాలని ఆదేశించినా ఎమ్మెల్యే వేసుకోమన్నారని యథావిధిగా పనులు కానిచ్చారు. దీనిపై మైకావీధి ప్రజలు మాట్లాడుతూ...1934లో జోగప్పగారి వెంకటప్ప అలియాస్ కుశలప్ప తనకు దాఖలాపడిన సర్వే నంబర్.200లో సత్రం నిర్మించేందుకు రాటకొండ గోవిందప్ప ఒప్పుకున్నందున దానపత్రం రాయించి రిజిస్టర్ చేశారన్నారు. అందులో పడమర దిక్కున రోడ్డు కనబరుస్తూ...గాంధీరోడ్డు నుంచి మైకావీధికి రాకపోకలకు చూపారన్నారు. అలాగే సత్రం జాగాకు అనుకుని ఉత్తరదిక్కున జోగప్పగారి వెంకటప్ప విక్రయించిన స్థలంలోనూ పడమర దిక్కున దారి చూపారన్నారు. ఇప్పటికే ఈ దారి విషయమై మైకావీధి ప్రజలు మదనపల్లె జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దావా దాఖలు చేసి రాకపోకలకు ఆటంకం కలిగించవద్దని ఉత్తర్వులు పొందారన్నారు. అయినప్పటికీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా అండతో దౌర్జన్యంగా దారిని ఆక్రమించుకోవడం తగదన్నారు. మున్సిపల్ అధికారులు మైకావీధికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సహకరిస్తాం

కలెక్టర్ శ్రీధర్ చామకూరి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

మదనపల్లె : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, అధిక లాభాలు వచ్చే విధంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఎల్ఆర్సీ భవనంలో బుధవారం ఎం–టమాటా వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ 6వ వార్షిక మహాసభ జరిగింది. ఏపీ మాస్ సీఈఓ సీఎస్.రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎన్ఐఆర్డీ రిటైర్డ్ డీజీ.డబ్ల్యూ.ఆర్.రెడ్డి, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మానవ వనరులతో పాటు చదువుకున్న యువత ఉన్నారని, వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. దేశంలో టమాటా పంటకు సంబంధించి చెప్పుకోదగ్గ మార్కెట్లలో మదనపల్లె ప్రధానమైనదన్నారు. ఎఫ్‌పీఓలు రైల్వేశాఖతో ఎంఓయూ కుదుర్చుకుని, పంట ఉత్పత్తులను నేరుగా ఢిల్లీ మార్కెట్‌కు పంపితే రైతులు లాభపడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎఫ్‌పీఓలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి, ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎం–టమాటో కంపెనీ అధ్యక్షులు బి.సంధ్య, ఎస్.పవిత్ర, వినాయకరెడ్డి, వాసుదేవరెడ్డి, ఏడీఏ శివకుమార్, ఏఓ నాగప్రసాద్, హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. పాఠశాలకు ప్రహరీ లేదని, నీటి సమస్య ఎక్కువగా ఉందని, పాఠశాల పరిసరాల చుట్టూ విద్యుత్ లైన్లు లేవని, టాయిలెట్ సమస్య ఉందని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి పాఠశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పిల్లలతోపాటు భోజనం చేశారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అక్కడి సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న ఫ్రీ హోల్డ్‌ను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఎంఈఓ కృష్ణయ్య, మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల డిజిటల్ విద్యపై శిక్షణ

రాయచోటి (జగదాంబసెంటర్) : దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించి వారిలో అభ్యసనా నైపుణ్యాలు పెంపొందించే అంశంపై సహిత విద్య రీసోర్స్ పర్సన్లకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి అధ్యక్షత వహించగా పరిశీలకుడిగా రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డాక్టర్ అమ్మినాయుడు హాజరయ్యారు.

జిల్లా ఫుట్‌బాల్ బాల,బాలికల జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా ఫుట్‌బాల్ బాలికల జట్టు

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ అండర్–17 బాల,బాలికల జట్టును స్థానిక ఆరోగ్యవరం సమీపంలోని వేద పాఠశాలలో బుధవారం ఎంపిక చేశారు. వీరికి అయిదు రోజుల పాటు శిక్షణ ఇచ్చిన తరువాత రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ సెక్రటరీ వసంత తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ లక్ష్మణరెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేంద్ర, అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజ, ఫుట్‌బాల్ సెలక్షన్ అబ్జర్వర్ ప్రభాకర్, కార్యదర్శి మురళీధర్, క్రీడా భారతి కార్యదర్శి నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు మహేంద్ర, ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన బాలికలు : వైష్ణవి, స్ఫూర్తి, ఇషిత, పల్లవి, మోక్షిత, అటీఫా సుల్తానా, చరణ్య, విష్ణుప్రియ, కీర్తన, రక్షిత, మాధురి, కీర్తి, లోహిత, అమృత, మౌనిక, హర్షవర్థిని, లలిత, స్టాండ్‌బైలుగా నీరజా గోస్వామి, హేమశ్రీ తన్మయి, మహాలక్ష్మి, ఢిల్లీజ

ఎంపికైన బాలురు : విష్ణువర్ధన్, దీక్షిత్‌రెడ్డి, ఈశ్వర్ ప్రసాద్, జవహర్‌రెడ్డి, చరణ్ వెంకట ప్రభువు, హరీష్, మనోజ్‌కుమార్, వంశీ కళ్యాణ్, వరుణ్‌సాయి, దిలీప్‌కుమార్, దిలీప్, ప్రణయ్‌కుమార్, సుదీప్, యశ్వంత్, త్రివేష్, ఆనంద్, నరేష్, శ్రీధర్, స్టాండ్‌బైలుగా రిహాన్, సాహిల్, అఖిల్‌రెడ్డి, రోహిత్, ఫైజాన్ ఎంపికయ్యారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి

సుండుపల్లె : దేవదాయశాఖ పరిధిలో ఉన్న అన్ని ఆలయాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని జిల్లా దేవదాయశాఖ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. సుండుపల్లె మండలంలోని విరూపాక్ష చెన్నకేశవ ఆలయాన్ని ఆయన పరిశీలించారు. ఆలయానికి సంబంధించి ఎలాంటి బంగారం అయినా తప్పనిసరిగా రికార్డులలో నమోదు చేసి తీరాలన్నారు. అలాగే అన్యాక్రాంతమైన సుండుపల్లెమ్మ, ఓదివేటమ్మ ఆలయాల భూములను పరిశీలించారు. ఆలయ నిర్వహణాధికారి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

పీలేరు : ముస్లిం మైనారిటీల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం పీలేరు పట్టణం తిరుపతి మార్గంలో ఎంపీని కలసిన ముస్లిం మైనారిటీ నాయకులు కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని తెలిపారు.

మ్యాప్ రీడింగ్‌లో మిట్స్ ఎన్‌సీసీ క్యాడెట్ ఘనత



రేవంత్ కుమార్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ విజయభాస్కర్

కురబలకోట : న్యూఢిల్లీలో ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్‌లో జరిగిన మ్యాప్ రీడింగ్ పోటీలలో అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ కె. రేవంత్‌కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి ఇతన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఇతని తల్లిదండ్రులు కె. కళావతి, కె. రవీంద్రను ప్రశంసించారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

మదనపల్లె : ఓ యువతికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని, నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పీటీఎం మండలం పులగంటివారిపల్లెకు చెందిన కిరణ్‌కుమార్(32) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మూడు నెలల క్రితం మదనపల్లెకు చెందిన ఓ యువతి వద్ద తనకు తెలిసిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5.30 లక్షలు నగదు తీసుకున్నాడు. అయితే ఉద్యోగం ఇప్పించకపోగా, తప్పించుకుని తిరుగుతుండటంతో మోసపోయానని గ్రహించిన యువతి జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు నాలుగురోజుల క్రితం ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.2.20 లక్షలు నగదు రికవరీ చేసినట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు అన్సర్‌బాషా, శ్రీనివాసులు నాయక్, హెడ్‌కానిస్టేబుల్ శివ, సిబ్బంది ఇర్ఫాన్, జమీర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

– ఒకరి మృతి



ప్రమాద స్థలంలో వెంకటరమణ

రామాపురం : జాతీయ రహదారి మార్గంలోని రామాపురం మండల పరిధిలోని చిట్లూరు దళితవాడ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా.. వెంకటరమణ (60) తన బావమరిదితో కలిసి ద్విచక్రవాహనంలో రాయచోటి నుంచి నల్లగుట్టపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలోని చిట్లూరు దళితవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణ కుడి కాలుపై వాహనం వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటరమణ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

యువకులపై దాడి

మదనపల్లె : పాతకక్షలతో ఇద్దరు యువకులపై మరో ఇద్దరు అన్నదమ్ములు అనుచరులతో కలిసి దాడిచేసిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. మోతీనగర్‌కు చెందిన యూసుఫ్(32)తో అదే ప్రాంతానికి చెందిన అన్నదమ్ములు అఫాన్, పర్వీన్‌లు గొడవపడుతుండగా, ఇమ్రాన్ యూసుఫ్‌కు మద్దతుగా గొడవను అడ్డుకున్నాడు. దీంతో అన్నదమ్ములైన అఫాన్, పర్వీన్‌లు అనుచరులతో కలిసి ఇమ్రాన్, యూసుఫ్‌లపై దాడిచేసి గాయపరిచారు. గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాయచోటి డీఎస్పీగా ఎం.ఆర్.కృష్ణమోహన్

రాయచోటి : రాయచోటి డివిజనల్ పోలీస్ అధికారిగా ఎం.ఆర్.కృష్ణమోహన్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సీఐలకు పదోన్నతి కల్పిస్తూ డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు అందాయి. అనంతపురం పోలీస్ శిక్షణా కేంద్రం (పీటీసీ)లో సీఐ స్థాయిలో పని చేస్తున్న ఈయనకు డీఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ రాయచోటికి బదిలీ చేశారు. ఇక్కడ డీఎస్పీగా పని చేస్తున్న రామచంద్రరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలన్నారు.

ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పనిసరి

తంబళ్లపల్లె : పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు. బుధవారం తంబళ్లపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో పర్యటించారు. వేరుశనగ పొలంలో రైతు పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంట దిగుబడిని పరిశీలించారు. ఈనెల 23వ తేదీ లోపు రైతులు ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేసుకోవాలన్నారు.

